ఆఖరి మజిలీకి చిక్కులే!

విశ్వేశ్వరయ్యనగర్ శ్మశాన వాటికలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు



కొందరు శ్మశానాలను కూడా వదలడం లేదు. ఇష్టానుసారంగా వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. పరిసరాలను జుగుప్సాకరంగా మార్చుతున్నారు. దీంతో ఆఖరిమజిలీకి కూడా అవస్థలు పడుతున్నారు. మరో వైపు అభివృద్ధి పనులు నిలిపివేయడంతో శ్మశానవాటికలో అడుగుపెట్టడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు.

- ఇష్టానుసారంగా వ్యర్థాల డంపింగ్
- గట్టులుగా రాళ్లు
- అడుగుపెట్టలేని విధంగా పరిసరాలు
- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- విశ్వేశ్వరయ్యనగర్ శ్మశాన వాటికలో దుస్థితి



చిందరవందరగా రాళ్లు



శ్మశానంలో గుట్టలుగా వ్యర్థాలు

గాజువాక: జీవీఎంసీ 71వ వార్డులోని విశ్వేశ్వరయ్య నగర్ కాలనీ సమీపంలోని ఆటోనగర్‌కు ఆనుకొని ఉన్న శ్మశాన వాటికలో సమస్యలు తిష్ట వేశాయి. అటు జీవీఎంసీ అధికారులు, ఇటు ఏపీఐఐసీ అధికారులు దీని అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. కొంత భవన నిర్మాణ, ఇతర వ్యర్థాలను శ్మశానవాటికలో డంప్ చేస్తున్నారు. దీంతో దహన సంస్కారాలు చేయడానికి కూడా అవస్థలు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఎకరాన్నర విస్తీర్ణంలో శ్మశానవాటిక ఉంది. గాజువాక మున్సిపాలిటీగా ఉన్న సమయంలో రక్షణ గోడ నిర్మించారు. అప్పట్లో ఐలా అధికారులు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. మున్సిపల్ నిధులతో ఒక వెయిటింగ్ హాల్, రెండు బోర్‌వెల్స్ నిర్మించారు. మొక్కలు కూడా పెంచారు. ఆ తరువాత దీన్ని పట్టించుకోవడం మానేశారు. దీంతో శ్మశానంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కొంత స్థలం ఆక్రమణకు గురైంది. ఉన్న వసతులు అటకెక్కాయి. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వంలో శ్మశానవాటిక అభివృద్ధికి జీవీఎంసీ సుమారు రూ.50 లక్షలతో టెండర్ ఖరారు చేసింది. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పనులు చేపట్టలేదు. దీంతో అప్పటి నుంచి సమస్యలు మరింత రెట్టింపు అయ్యాయి.

నిలిచిన పనులు : శ్మశానవాటికలో బర్నింగ్ షెడ్లతో పాటు వివిధ పనులు ప్రారంభించారు. అయితే బేస్‌మెంట్, పిల్లర్లు పూర్తి చేసిన తర్వాత పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. అయినా కూటమి నాయకులు, అధికారులు పట్టించుకోలేదు.

అడుగడుగునా అవస్థలు

విశ్వేశ్వరయ్యనగర్ కాలనీకి ఆనుకొని హైవే అవతల గల శ్రీరామ్‌నగర్, శ్రీనగర్ కొండవాలు, ఉప్పరకాలనీ, గురునాథరావు కాలనీ, రెల్లి కాలనీ, మన్నా ట్యాంక్ ఏరియా వాసులు ఈ శ్మశాన వాటికలోనే మృతదేహాలను దహనం చేస్తారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కైలాసభూమికి వెళ్లేందుకు సరైన రోడ్డు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. శ్మశానానికి రోడ్డు వేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నా అధికారులు స్పందించడం లేదని రాష్ట్ర వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పప్పు రాజారావు తెలిపారు. అటు జీవీఎంసీ అధికారులకు, ఇటు ఐలా అధికారులకు వినతి పత్రాలు కూడా అందజేసినట్టు పేర్కొన్నారు. కనీసం ల్యాండ్ లెవలింగ్ చేయించాలని కోరుతున్నారు.

మర్యాద పూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని స్థానిక 70వ వార్డు కార్పొరేటర్, గాజువాక మాజీ సమన్వయకర్త ఉరుకూటి చందు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన వారు విశాఖలో ప్రస్తుత రాజకీయ పరిణామాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. - గాజువాక

కాంట్రాక్ట్ కార్మికులకు మెడికల్ చెకప్‌లు రద్దు చేయాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు మెడికల్ చెకప్‌లు రద్దు చేయాలని విశాఖ ఉక్కు శ్రామిక సంఘం ప్రధానకార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాది నుంచి వచ్చిన కొంత మంది ఉన్నతాధికారులు తెలుగు కార్మికులపై వివక్షతతో వ్యవహరిస్తున్నారన్నారు. తెలుగు వారిని పనుల నుంచి తొలగించాలనే కుట్రతో కొత్తగా మెడికల్ చెకప్‌లు తెరపైకి తెచ్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. త్రిశక్తి దేవాలయం, నవ నాగశక్తి పుట్ట 18వ వార్షికోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, నవనాగ మండపారాధనతో పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కల్యాణంలో స్టీల్‌ప్లాంట్ పూర్వ సీఎండీ వై. శివసాగరరావు దంపతులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి

గాజువాక: యువత, విద్యార్థులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. ఈజీ మనీకి అలవాటు పడివారు ఈ బెట్టింగుల బారిన పడి నష్టపోతున్నారన్నారు. ఆన్‌లైన్ బెట్టింగుల జోలికి ఎవరూ వెళ్లవద్దని, అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

అందుబాటులోకి నూతన ఫైర్ ఇంజిన్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో అత్యాధునిక ఫైర్ ఇంజిన్‌ను గురువారం ప్రారంభించారు. పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ పోర్టులో భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా మల్టీపర్పస్ ఫైర్ ఇంజిన్‌ను కొనుగోలు చేసినట్టు తెలిపారు. 11వేల లీటర్ల నీటి సామర్థ్యం, వెయ్యి లీటర్ల ఫోమ్, డ్రైపౌడర్ సిస్టమ్‌తో కూడిన ఈ ఫైర్ ఇంజిన్ అగ్ని ప్రమాదాలను నియంత్రించడానికి ఉపయోగపడుతుందన్నారు.

కనుల పండువగా మరిడిమాంబ జాతర



పుష్పాలంకరణలో మరిడిమాంబ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలస గ్రామ ఇలవేల్పు మరిడిమాంబ అమ్మవారి జాతర కనుల పండువగా నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అగనంపూడి సెక్టార్-1,2,3 నిర్వాసితకాలనీలు, దువ్వాడ, ఫార్మాసిటీ నిర్వాసితకాలనీల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని పసుపు, కుంకుమలు, చీర సారెలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. భారీ మందుగుండు సామగ్రితో సాయంత్రం అమ్మవారి ఘటాలను ఊరేగించారు.

పాఠశాల విద్య బలోపేతానికి చర్యలు

పెదగంట్యాడ: పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగా అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మండల విద్యా శాఖాధికారి కె.రమణాజీ అన్నారు. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నవచేతన-ఆదర్శల ప్రొహిబిషన్ బీ-పడాయిబీపై నెల్లిముక్కు ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీలకు గురువారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో మానసిక పరిపక్వతను గుర్తించి ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ఐసీడీసీఎల్ ప్రాజెక్ట్ అధికారి డి.నీలవేణి, సూపర్‌వైజర్లు సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపులో కూటమి విఫలం



తహసీల్దార్ అమలకు దరఖాస్తులు అందజేస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం పేదల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పెదగంట్యాడ తహసీల్దార్ అమలకు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు దాటినా ఇంతవరకు ఇచ్చిన హామీలు నెరవేర్చ లేదన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించగా వందలాది పేద కుటుంబాలు అందజేశాయన్నారు. ప్రభుత్వం స్పందించి నెల రోజుల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, పి. చంద్రశేఖర్, ఎ. విమల పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతతో ఆరోగ్యం



నోటి పరిశుభ్రత ఆవశ్యకతను వివరిస్తున్న డాక్టర్ జాన్సన్



దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

అగనంపూడి: నోటి పరిశుభ్రతపై ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, నోటి దుర్వాసన రాకుండా రోజుకు రెండు పూటలా బ్రెష్ చేసుకోవాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి దంత వైద్య నిపుణుడు డాక్టర్ జాన్సన్ జయశేఖర్ అన్నారు. నోటి ఆరోగ్య (ఓరల్ హెల్త్‌డే) మాసోత్సవాల సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో రోగులకు, వారి సహాయకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి పరిపాలనాధికారి రవిరాజ్, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి పాల్గొన్నారు.

పెదగంట్యాడ: దంతాల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని చేపలపాలెం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కూరపాటి వినోద్ కుమార్ అన్నారు. విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

అభివృద్ధి పనులకు మోక్షం కల్పించండి



తవ్వేసిన కల్యాణమండపంను పరిశీలిస్తున్న సీఈ, అధికారులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డులో అభివృద్ధి పనులకు మోక్షం కల్పించాలని జీవీఎంసీ సీఈ శివప్రసాదరాజును వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి కోరారు. సీఈ శివప్రసాదరాజు గురువారం పలువురు అధికారులతో కలిసి తుంగ్లాంలో కార్పొరేటర్ గోవిందరెడ్డితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తమ వార్డులో పనులు ఎందుకు ఆగిపోయాయో తెలపాలన్నారు. సీఈ మాట్లాడుతూ తుంగ్లాంలో కల్యాణమండపం తొలగింపు అంశం గాజువాక ఎమ్మెల్యేకు తెలియకుండా జరిగిందన్నారు. కల్యాణమండపం నిర్మాణానికి నిధులను గత ప్రభుత్వం హయాంలో సాధించుకన్నామని, అయినా ఎందుకు జాప్యం చేస్తున్నారని సీఈని కార్పొరేటర్ గోవిందరెడ్డి ప్రశ్నించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ ఎం.ఆర్.ఎస్.అప్పారావు, డీఈ వెంకటేశ్వరరావు, వాటర్ సప్‌లై డీఈ బి.శ్రీనివాసరావు, ఏఈ పి.కేదారినాథ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

15 తులాల బంగారం అపహరణ



ఇంటిని పరిశీలిస్తున్న క్రైం ఏసీపీ లక్ష్మణరావు, ఎస్‌ఐ మన్మథరావు

అక్కిరెడ్డిపాలెం: బీరువాలో భద్రపర్చిన 15 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు గాజువాక దరి శ్రీనగర్‌కు చెందిన టి.నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. క్రైం పోలీసులు తెలిపిన వివరాలు.. నాగలక్ష్మి భర్త చనిపోవడంతో ఒక్కర్తే ఉంటుంది. బుధవారం వడ్లపూడిలోని చెల్లెలు ఇంటికి శుభాకార్యానికి వెళ్లి తిరిగి అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చింది. తలుపులు దగ్గరగా వేసి ఉండటంతో అనుమానం వచ్చి ఇంట్లో బీరువాను పరిశీలించగా 15 తులాల బంగారం దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. వెంటనే గాజువాక క్రైం పోలీసులకు సమాచారం అందించింది. క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ మన్మథరావు ఇంటికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించగా ఎటువంటి ఆధారాలు దొరకలేదు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను గురువారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వార్డు సచివాలయ సిబ్బందితో మాట్లాడి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.

పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం



మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ఐద్వా నాయకులు

అక్కిరెడ్డిపాలెం: ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకురాలు, తెలంగాణ సాయుధ పోరాట నాయకురాలు మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతిని 69వ వార్డు షీలానగర్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఐద్వా నాయకురాలు వై.సత్యవతి మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన స్వరాజ్యం పేద సమస్యలపై చనిపోయే వరకు పోరాడారన్నారు. ఆమె స్ఫూర్తితో మహిళలు హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి.మణి, మానస, సునీత, పుష్ప, దేముడమ్మ, వందన, గీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు, గ్రామపెద్దలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఏడుమెట్ల మర్రిపాలెం బస్టాప్ కూడలి సమీపంలోని రుణ విమోచన లక్ష్మీ గణపతి ఆలయ ఐదో వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. విశేష అన్న సమారాధన నిర్వహించారు. అన్న ప్రసాదాలు స్వీకరించారు. నాయకులు కొలిపాక అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, బొద్దపు వెంకటరమణ, యలమంచిలి సన్యాసిరావు, ములగపాక బాబూరావు, విందుల వరప్రసాద్ పాల్గొన్నారు.

17,300 మందికి జప్తు నోటీసులు



అసెస్‌మెంట్‌దారులతో మాట్లాడుతున్న జెడ్సీ శేషాద్రి

గాజువాక: ఆస్తి పన్ను వసూలుకు జీవీఎంసీ గాజువాక జోనల్ అధికారులు చర్యలను ముమ్మరం చేశారు. అందులో భాగంగా మొండి బకాయిదారులను గుర్తించారు. వారిపై కొరడా ఝుళిపిస్తున్నారు. గాజువాక జోన్‌లో ఏకంగా 17,300 మందికి జప్తు నోటీసులను సిద్ధం చేసి పంపిణీని ప్రారంభించారు. 1,17,213 అసెస్‌మెంట్లు ఉన్న గాజువాక జోన్‌లో మొత్తం ఆస్తి పన్ను రూ.83.80 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకూ రూ.54.31 కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.29.48 కోట్లు పెండింగ్‌లో ఉండిపోయింది. మొండి బకాయిలు ఉన్న 17,300 మంది పన్ను బకాయిదారులకు జప్తు నోటీసులు అందిస్తున్నారు. గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి నేతృత్వంలో జోనల్ సహాయ కమిషనర్ సీహెచ్.రామనారాయణ, రెవెన్యూ అధికారి ఎం.శ్రీకాంత్ తదితరులు అసెస్‌మెంట్‌దారులతో చర్చించి పన్ను వసూలుకు ఒత్తిడి పెంచారు. అందులో భాగంగా వివిధ వార్డుల్లో పలు భవనాలను గురువారం సీజ్ చేశారు. ఇదిలా ఉండగా, గాజువాక జోన్‌లో నీటి పన్నులు సైతం భారీ మొత్తంలో పెండింగ్‌లో ఉండిపోయాయి. 20 వార్డులతో విస్తరించి ఉన్న గాజువాక జోన్‌లో మొత్తం 58,028 కుళాయి కనెక్షన్లున్నాయి. వాటి నుంచి రూ.21.32 కోట్ల పన్ను వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం రూ.2.46 కోట్లు మాత్రమే వసూలైనట్టు అధికారులు తెలిపారు. ఏడాది మొత్తం ప్రయత్నించినా 11.57 శాతం కూడా వసూలు కాకపోవడంతో ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కనెక్షన్ తొలగిస్తామంటూ 4,400 మందికి నోటీసులను అందిస్తున్నారు. ఇప్పటికే కుళాయి కనెక్షన్ల తొలగింపు చేపట్టారు. కాగా, వివిధ వివాదాలు, సాంకేతిక సమస్యల నేపథ్యంలో పలు కనెక్షన్లను తొలగించాల్సి ఉందన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవశ్యం



మాట్లాడుతున్న 8వ అదనపు జిల్లా జడ్జి కవిత

పెదగంట్యాడ: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని 8వ అదనపు జిల్లా జడ్జి కవిత అన్నారు. గాజువాక మండల లీగల్ కమిటీ ఆధ్వర్యంలో గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలు, బాలికల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో మహిళలపై వేధింపులు, దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పరిస్థితులు, సామాజిక సమస్యలు, అవగాహన లోపం వీటికి ప్రధాన కారణమన్నారు. చట్టాలను కఠినంగా అమలు చేసేందుకు ప్రభుత్వాలు, కోర్టులు, పోలీసులు ముందుండాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం మాలతి, ఉపాధ్యాయుడు రాజారావు, సోషల్ వర్కర్ వినోద్ బాలు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌లో పలువురు ఏకగ్రీవం

గాజువాక: గాజువాక బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల్లో భాగంగా వివిధ స్థానాలకు పలువురు న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల అధికారి శ్రీనివాస్ ఆ వివరాలను ప్రకటించారు. ఉపాధ్యక్షురాలిగా కె.సత్యవాణి, గ్రంథాలయ కార్యదర్శిగా బి.వి.ఎం.కృష్ణ, మహిళా ప్రతినిధిగా సూర్యకళతోపాటు కార్యవర్గ సభ్యులుగా సీహెచ్.గంగాభవాని, ఎం.కనక మహాలక్ష్మి, ఎ.మురళీమోహన్, ఆర్.రేవతి, ఎం.విజయ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పేర్కొన్నారు. కాగా, బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి బి.వేదమణి, ఎం.వేణు, కార్యదర్శి స్థానానికి టి.ప్రసన్న కుమారి, డి.చిరంజీవి, సంయుక్త కార్యదర్శిగా ఇ.గిల్బర్ట్, జామి శ్యామలరావు, ఎల్.సత్యనారాయణ, పల్లా శ్రీనివాసరావు పోటీలో ఉన్నట్టు ఎన్నికల అధికారి తెలిపారు.

'ఎంబార్కేషన్ పాయింట్ తొలగింపు అన్యాయం'

గాజువాక: హజ్ యాత్రికుల సౌకర్యార్థం విజయవాడలో ఏర్పాటు చేసిన ఎంబార్కేషన్ పాయింట్‌ను తొలగించడం అన్యాయమని హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ మహ్మద్ ఇమ్రాన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పాయింట్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంటుందని తెలిసినా ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. రంజాన్ మాసంలో కూటమి ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన వెన్నుపోటు తోఫా ఇదేనని అన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేశారని అన్నారు. 2873 మంది యాత్రికులకు జగన్ ప్రభుత్వం రూ.14.04 కోట్ల నిధులను కేటాయించడంతోపాటు ఎంబార్కేషన్ పాయింట్ నుంచి బయల్దేరిన యాత్రికులకు ఆర్థిక సాయం అందజేశారన్నారు.

నిరుపేద అర్చకుడికి ఆర్థిక సాయం



అర్చకునికి నగదు అందిస్తున్న విందుల వెంకటరమణ

అగనంపూడి: ఆచారం ప్రకారం గ్రామదేవత పండగను ముందుండి నడిపించాల్సిన అర్చకుడు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కొండయ్యవలసకు చెందిన జనసీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విందుల వెంకటరమణ ఉదారత చాటుకున్నారు. శీరందాస్ సన్యాసి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న వెంకటరమణ గురువారం రూ.5వేల నగదు అందించారు. సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుడే సుశీలా గజేంద్రరావు ,సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు, విందుల వరహాలు, ఎం. నాగేశ్వరరావు, బుదిరెడ్డి అప్పారావు, శీరందాస్ బంగారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అక్కిరెడ్డిపాలెం: 11 కేవీ తోకాడ, 33/11 కేవీ ఆటోనగర్ ఎస్ఎస్ నిర్వహణ పనుల్లో భాగంగా ఆటోనగర్ సెక్షన్‌లో తోకాడ ప్రాంతంలో శుక్రవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ 2 ఈఈ బి.కె.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రోడ్డులో కారు బోల్తా

ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో బోల్తా పడిన కారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రధాన రహదారిలో గురువారం చెట్టును ఢీకొని కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. నర్సీపట్టణానికి చెందిన జి. రాహుల్ కారులో అతివేగంగా తెలుగు తల్లి కూడలి వైపు వస్తున్నారు. ఆ కూడలికి చేరేసరికి కారు అదుపు తప్పి ముందు బైక్‌పై వెళ్తున్న టౌన్‌షిప్‌కు చెందిన కె. కోటేశ్వరరావు (61) బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని బోల్తా పడింది. అదే మార్గంలో వెళ్తున్న మరో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పెదగంట్యాడకు చెందిన ఇందల అప్పారావు (51)ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఇరువురు వ్యక్తులను వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స నిమిత్తం చేర్చారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.